భవిష్యత్‌లోనూ కలిసే పనిచేస్తాం

- టిఆర్‌ఎస్‌ను గెలిపించిన వామపక్షాలకు ధన్యవాదాలు
- ప్రభుత్వపరంగా సమస్యలను పరిష్కరిస్తాం : జగదీశ్‌రెడ్డి
- బిజెపిని దేశభక్తులందరూ తరిమికొట్టాలి
- 12న ప్రధాని పర్యటనకు వ్యతిరేకంగా నిరసన : తమ్మినేని
- ఎంబి భవన్‌లో సిపిఎం నేతలతో జగదీశ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి భేటీ


మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలతో భవిష్యత్‌లోనూ కలిసే పనిచేస్తామని విద్యుత్ శాఖ మంత్రి జి జగదీశ్‌రెడ్డి అన్నారు. మునుగోడులో టిఆర్‌ఎస్‌ను గెలిపించిన వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు చెప్పారు. హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో మంగళవారం మంత్రి జగదీశ్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సిపిఎం నాయకులతో భేటి అయ్యారు. మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డికి శాలువా కప్పి సిపిఎం నాయకులు సన్మానించారు. అనంతరం పలు అంశాలంపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ మునుగోడులో టిఆర్‌ఎస్‌కు మద్దతిచ్చిన సిపిఎం నేతలకు కృతజ్ఞతలు చెప్పారు. బిజెపి మళ్లీ గెలిస్తే ఈ దేశాన్ని మధ్యయుగాల నాటి పరిస్థితులకు తీసుకెళుతుందని విమర్శించారు.

బిజెపిని నిలువరించే శక్తి టిఆర్‌ఎస్‌కు, సిఎం కెసిఆర్‌కు ఉన్నందునే సిపిఐ, సిపిఎం మద్దతిచ్చాయని అన్నారు. మునుగోడులో ఆయా పార్టీల రాష్ట్ర కార్యదర్శులతో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు పనిచేశారనీ, కసితో మతోన్మాద శక్తులను ఓడించారని వివరించారు. ఈ ఐక్యత ఇక ముందు కొనసాగాలని ఆకాంక్షించారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని చెప్పారు. ఎనిమిదేళ్లుగా మోడీ ప్రభుత్వం తిరోగమన విధానాలను అవలంభించిందని విమర్శించారు. మునుగోడు ఉప ఎన్నికలు బిజెపి కుట్రపూరితంగా తెచ్చిందన్నారు. ఎమ్మెల్యేలను కొనడం, ప్రభుత్వాలను పడగొట్టడం, అక్రమాలు, దుర్మార్గాలకు పాల్పడిందన్నారు. కెసిఆర్‌ను తెలంగాణకే పరిమితం చేయాలనీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని కుట్ర చేసిందని చెప్పారు. టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు లొంగిపోలేదనీ, మునుగోడు ఫలితం బిజెపికి చెంపపెట్టులాంటిదని అన్నారు. వామపక్ష పార్టీలు, నాయకులు చారిత్రక బాధ్యతను నెరవేర్చారని అన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వపరంగా చేయాల్సినవి పరిష్కరిస్తామని చెప్పారు. వాటిని ఇప్పటికే కమ్యూనిస్టు పార్టీల నాయకులు సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లారని గుర్తు చేశారు. అభివృద్ధి నిరోధక శక్తులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులతో భవిష్యత్తులోనూ కలిసి పనిచేస్తామన్నారు. బిజెపి నుంచి దేశానికి విముక్తి కల్పించాలని కోరారు.

వాళ్లిద్దరూ... వారికిద్దరూ : తమ్మినేని

నిజాంకు వ్యతిరేక పోరాడిన గడ్డ తెలంగాణ అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. కమ్యూనిస్టుల బలం ప్రస్తుతం తక్కువగా ఉండొచ్చు... కానీ తమ ప్రభావం ఎక్కువగా ఉంటుందని అన్నారు. భవిష్యత్‌లోనూ బిజెపిని ఎదుగుదలను అడ్డుకుంటామన్నారు. మునుగోడులో బిజెపిని ఓడించేందుకు, టిఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు సైద్ధాంతిక పోరాటం చేశామని వివరించారు. ప్రతి ఇంటికి బిజెపి ప్రమాదాన్ని తీసుకెళ్లామని అన్నారు. గవర్నర్ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం లేదన్నారు. తెలంగాణ గవర్నర్ వద్ద అనేక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఏడాది కింద ప్రారంభమైన రామగుండం ఎరువుల పరిశ్రమను ప్రధాని మోడీ మళ్లీ ప్రారంభించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికే రూ.87 కోట్ల లాభం వచ్చిందన్నారు. ప్రధాని స్థాయిలో మోడీ ఇలా వ్యవహరించడం సరైంది కాదని చెప్పారు. ఈ నెల 12న రామగుండంకు ప్రధాని మోడీ పర్యటన సందర్భంగా నిరసనలు వ్యక్తం చేస్తామన్నారు. దక్షిణ భారతదేశంలో బలహీనంగా ఉన్న బిజెపి ఎదగడం కోసమే మునుగోడులో ఉప ఎన్నిక తెచ్చిందని అన్నారు. ఇడి, సిబిఐ, డబ్బు, అధికారం ప్రభావంతో గెలిచి కాంగ్రెస్‌ను నాశనం చేసి టిఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం తామేనని రుజువు చేయాలని భావించిందన్నారు. ఫాసిస్టు ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ విభాగమైన బిజెపి దేశానికి ప్రమాదకరమని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు వ్యతిరేకమని వివరించారు. కులవ్యవస్థ ఉండాలని కోరుకునే పార్టీ అనీ, సమానత్వాన్ని కోరుకోదని చెప్పారు. చాతుర్వర్ణ వ్యవస్థ, మనుధర్మం అమలుకు అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అడ్డుగా వస్తుందని అన్నారు. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మునుగోడు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడతానని అన్నారు. సిఎం కెసిఆర్, కెటిఆర్ సహా ఇతర మంత్రుల సహకారంతో ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, టిఆర్‌ఎస్ నాయకులు ఓ నర్సింహ్మారెడ్డి ఉన్నారు. వారికి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, జి నాగయ్య, బి వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, డిజి నరసింహారావు, మల్లు లక్ష్మి, ఎండి అబ్బాస్, టి సాగర్ స్వాగతం పలికారు. అంతకుముందు ఎమ్మెల్యే బాల్క సుమన్, టీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సిపిఎం నేతలను మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు.

సిపిఐ నేతలతో మంత్రి జగదీశ్ రెడ్డి భేటీ

మునుగోడు ఉప ఎన్నికల్లో టిఆర్‌ఎస్ విజయం సాధించిన నేపథ్యంలో సిపిఐ నేతలతో మంగళవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, గ్యాదరి కిశోర్, ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీందర్‌రావు భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, ఈటి నర్సింహా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యేగా గెలిచిన కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మంత్రి జగదీశ్‌రెడ్డికి సిపిఐ నేతలు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు ప్రభుత్వ విప్ బాల్క సుమన్, టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సిపిఐ నేతలను మార్యదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ వామపక్షాలతో టిఆర్‌ఎస్ ఐక్యతను ఇక ముందూ కొనసాగించాలని అన్నారు. దేశంలో మతతత్వ, అభివృద్ధి నిరోధక శక్తులను నిలువరించేందుకు ప్రగతిశీల శక్తులు కలిసి పని చేయాల్సిన అవసరముందన్నారు. ఇదే పద్ధతిలోనే ప్రయాణం చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో సజావుగా సాగుతున్న పరిపాలనకు ఆటంకాలను సృష్టించి, అభివృద్ధిని అడ్డుకునేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, బిజెపి రెండూ కలిసి కుట్రతో ఈ ఉప ఎన్నికను తెచ్చాయన్నారు. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టులు, ప్రజల విశ్వాసాన్ని చూరగొంటాననీ, నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని హామీనిచ్చారు. మునుగోడు ఉప ఎన్నిక ద్వారా బిజెపికి ముగింపు కార్డ్ వేశామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తామంటూ ఇది వరకే సీఎం కేసీఆర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.


అంబానీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న క్షౌరవృత్తిదారులు

ముఖేష్ అంబానీ దిష్టిబొమ్మ దహనం

- క్షౌరవృత్తిలోకి కార్పొరేట్ సంస్థల రాకపై ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్షౌరవృత్తిలోకి కార్పొరేట్ సంస్థలు రావడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ క్షౌరవృత్తిదారుల సంఘం పిలుపులో భాగంగా నిరసన తెలిపారు. హైదరాబాద్‌లోని చైతన్యపురి శివాజీ విగ్రహం వద్ద నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రిలయన్స్ అధిపతి ముఖేష్ అంబానీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. అనంతరం రాష్ట్ర చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ నాయకులు పి ఆశయ్య మాట్లాడుతూ.. బడా కార్పొరేట్ సంస్థలు క్షౌరవృత్తిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అంబానీ వల్ల లక్షలాది మంది నాయీ బ్రాహ్మణుల ఉపాధి దెబ్బతింటుందని, వారు రోడ్డు మీద పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్టు కరోనా వైరస్‌తో ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు రిలయన్స్ సంస్థ క్షౌరవృత్తిలోకి ప్రవేశించడం తగదన్నారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అంబానీ, అదానీల ప్రయోజనాలు కాపాడే విధంగా పాలకులు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు. క్షౌరవృత్తిలోకి కార్పొరేట్ సంస్థలకు అనుమతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిషేధించాలని డిమాండ్ చేశారు.



ర్యాలీ చేస్తున్న బిసిడబ్ల్యుఎఫ్, సిఐటియు నేతలు

ప్రభుత్వాల సరళీకృత విధానాలతో కుదేలైన నిర్మాణరంగం

- కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- బహిరంగ సభలో బిసిడబ్ల్యుఎఫ్ జాతీయ అధ్యక్షులు సుఖ్‌బీర్ సింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సరళీకృత విధానాల వల్ల నిర్మాణరంగం కుదేలైందని, కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ సంస్థలను ప్రయివేటీకరణ చేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (బిసిడబ్ల్యుఎఫ్) జాతీయ అధ్యక్షులు సుఖ్‌బీర్‌సింగ్ విమర్శించారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రాజగోపాల్ ప్రాంగణంలో బిసిడబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో ఫెడరేషన్ రాష్ట్ర మూడవ మహాసభ నిర్వహించారు. కాగా భవన నిర్మాణ కార్మికులు చేపట్టిన ర్యాలీతో మానుకోట దారులన్నీ ఎరుపెక్కాయి. గాంధీ పార్క్ నుంచి సభ ప్రాంగణం వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. డప్పు కళాకారులు, మహిళలు, కర్ర నృత్యాలతో ర్యాలీ చేపట్టారు. అనంతరం రాజగోపాల్ ప్రాంగణంలో వంగూరు రాములు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో సుఖ్‌బీర్‌సింగ్, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు సాయిబాబు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, బిసిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరాజు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పాలనలో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రజల ప్రాణాలను గాలికి వదిలేసిందన్నారు. సోషలిస్టు దేశాలైన చైనా, క్యూబా లాంటి దేశాల్లో కరోనాను ప్రతిష్టాత్మకంగా ఎదుర్కొని ప్రజల ప్రాణాలు కాపాడారని గుర్తుచేశారు. ప్రధాని మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారీ విధానానికి అనుకూలంగా ఉండి అంబానీ, ఆదానీల కోసం రెడ్ కార్పెట్ పరుస్తోందన్నారు. అనేక పోరాటాలు, ఉద్యమాల ఫలితంగానే 1926లో కేంద్ర సమగ్ర చట్టం ఏర్పడిందని చెప్పారు. కార్మిక కుటుంబాలు బతకాలంటే కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్మిక సమస్యలు పరిష్కరించేందుకు భగత్ సింగ్ వారసుల్లాగా ఐక్యతతో ముందుకొచ్చి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇందుకు అన్ని కార్మిక సంఘాలు ఐక్యం కావాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి మధు, సిఐటియు జిల్లా అధ్యక్షకార్యదర్శులు కుంట ఉపేందర్, ఆకుల రాజు, ఆహ్వాన సంఘం అధ్యక్షులు శంకర్, సూర్ణపు సోమయ్య, బిసిడబ్ల్యుయు జిల్లా అధ్యక్షకార్యదర్శులు శ్రీశైలం, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి గోల్ఫ్ టోర్నమెంట్

ప్రజాశక్తి-హైదరాబాద్

హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ (హెచ్‌జిసి) వద్ద టోల్ఫ్ టోర్నమెంట్ పోటీలు ఈ నెల తొమ్మిది నుంచి 12 వరకూ జరగనున్నాయి. ఈ పోటీలో రూ.40 లక్షల నగదు బహుమతి అందజేస్తారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ (హెచ్‌జిఎ), ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (పిజిటిఐ), ఐరా సమర్పణలో తెలంగాణా మాస్టర్స్ 2022 పవర్డ్ బై తెలంగాణా టూరిజం పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో 125 మంది గోల్ఫర్లు (121 మంది ప్రొఫెషనల్స్, నలుగు ఔత్సాహికులు) పాల్గొంటున్నారు. ఈ పోటీలకు ఐరా రియాల్టీ టెక్ ప్రెజెంటింగ్ పార్టనర్‌గా వ్యవహరిస్తుండగా, పవర్డ్ బై పార్టనర్‌గా తెలంగాణా టూరిజం, హోస్ట్ వెన్యూగా హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్, హాస్పిటాలిటీ భాగస్వామిగా మారియట్ హైదరాబాద్ వ్యవహరిస్తున్నాయి. 2015లో ఈ పోటీలు ప్రారంభమైన నాటి నుంచి తెలంగాణా ప్రభుత్వం మద్దతు అందిస్తుంది.

11, 12న హైదరాబాద్‌లో వాల్వ్స్ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి-హైదరాబాద్

అపోలో హాస్పిటల్ సహకారంతో హైదరాబాద్ వాల్వ్ - ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్‌ల అసోసియేషన్ సంక్లిష్టమైన కార్డియాక్ జోక్యాలలో తాజా పురోగతులపై రెండ్రోజుల పాటు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసింది. ఈ నెల 11, 12వ తేదిల్లో రెండు రోజుల హైదరాబాద్ వాల్వ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. అపోలో హాస్పిటల్స్ గ్రూప్, వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి 2022 సదస్సును లాంఛనంగా ప్రారంభించనున్నారు. భారతదేశం, బంగ్లాదేశ్, నేపాల్, యుకె, యుఎస్ఎ, హంగరీ, బహ్రెయిన్ వంటి దేశాల నుండి 400 మందికి పైగా ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కానున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ సదస్సులో ప్రపంచ ప్రఖ్యాత కార్డియాలజిస్టులు టిఎవిఐ, ఆవిష్కర్త, ప్రొఫెసర్ అల్కెన్ క్రిబియర్, ఫ్రాన్స్‌కు చెందిన ప్రొఫెసర్ హెలెన్‌బీ యూరప్ నుండి డాక్టర్ పీటర్ ఆండ్రేకా, యుఎస్ఎ నుండి డాక్టర్ రమేష్‌లు ఫ్యాకల్టీగా ఉండనున్నారని తెలిపారు.

పర్యాటకుల భూతల స్వర్గం తెలంగాణ

- మంత్రి శ్రీనివాస్ గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ పర్యాటకుల భూతల స్వర్గంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నామని పర్యాటక శాఖ మంత్రి డాక్టర్ వి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. లండన్‌లో వరల్డ్ ట్రావెల్ మార్ట్ (డబ్ల్యుటిఎం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ పర్యాటక శాఖ స్టాల్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం అసోసియేషన్ ఆఫ్ బ్రిటిష్ ట్రావెల్ ఏజెంట్స్ (ఎబిటిఎ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇండియా టూరిజం కార్యదర్శి అరవింద్ సింగ్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు దేశాల ప్రతినిధులతో టూరిజం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని తెలిపారు. రామప్పకు యునెస్కో గుర్తింపుతో పాటు పోచంపల్లి ప్రపంచ పర్యాటక గ్రామంగా ఎంపికయ్యేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందని తెలిపారు. కోవిడ్ తర్వాత ప్రపంచ పర్యాటక రంగం ఇప్పుడిప్పుడే పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తోందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

- లారీని ఢీకొన్న ఇన్నోవా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధి డీసీతండా వద్ద ఆగి ఉన్న లారీని ప్రకాశం జిల్లా నుంచి వరంగల్ నగరానికి వస్తున్న ఇన్నోవా వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందగా, మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులు వరంగల్ జిల్లా కేంద్రంలోని పెరికవాడలో నివాసముండే బిల్డర్ ఇల్లారి కృష్ణారెడ్డి (45), భార్య వరలక్ష్మి(35), కుమారుడు వెంకట సాయి (14)గా గుర్తించారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని రోడ్డుపై నిలపడంతో ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. ఎస్ఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. కార్తీక పౌర్ణమి వేడుకలు జరుపుకునేందుకు కృష్ణారెడ్డి కుటుంబంతో కలిసి ఆయన సొంత గ్రామమైన ప్రకాశం జిల్లా శంకరాపురానికి ఇన్నోవా కారులో వెళ్లి తిరిగి వస్తున్నారు. కాగా, వరంగల్ వైపు వెళుతున్న లారీని ఎటువంటి ఇండికేటర్, పార్కింగ్ లైట్స్ వేయకుండా నిర్లక్ష్యంగా రోడ్డుపై డ్రైవర్ పార్కింగ్ చేశాడు.


కారులో ఇరుకున్న మృతదేహాలు

అదే సమయంలో సోమవారం తెల్లవారుజామున 4:30గంటల సమయంలో ఇన్నోవా వర్ధన్నపేట శివారు డీసీ తండా మూల మలుపు వద్ద నిర్లక్ష్యంగా పార్కింగ్ చేసి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. కారులో ఎడమ వైపు కూర్చున్న కృష్ణారెడ్డి, వరలక్ష్మి, వెంకటసాయిరెడ్డికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కారులో ఇరుక్కున్న మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆరుగురు క్షతగాతులను మెరుగైన చికిత్స నిమిత్తం ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు. ఇల్లారి రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు తెలిపారు.

పాత పద్ధతిలో గొర్రెల పంపిణీ ఒద్దు

- నగదు బదిలీ చేయాలి
- జిఎంపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గొర్రెల పంపిణీకి సంబంధించి నగదు బదిలీ చేయకుండా పాత పద్ధతిలోనే వాటిని పంపిణీ చేస్తామంటే ప్రభుత్వం గొల్లకురుమల ఆగ్రహానికి గురికాక తప్పదని గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం (జిఎంపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. మునుగోడు ఎన్నికతోపాటే గొర్రెల పంపిణీకి నగదు బదిలీ పథకం కూడా ముగిసినట్టేననీ, మళ్లీ పాత పద్ధతిలోనే గొర్రెలు పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందంటూ వార్తలొస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గొల్లకురుమల అభివృద్ధి పేరుతో తెచ్చిన పథకం వారికి ఉపయోగపడేలా చేస్తారా? లేదంటే గతంలో మాదిరిగా మధ్య దళారీలకు, కొంతమంది పశువైద్యాధికారులకు కొంతమంది నాయకులకే లబ్ది చేకూరుస్తారా? అని ప్రశ్నించారు. వెంటనే మంత్రి కెటిఆర్ ఇతర మంత్రులు స్పందించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా గొల్లకురుమలను చైతన్యం చేసి ఉద్యమాన్ని చేపడుతామనీ, ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

రాష్ట్రంలో భారత్ జోడో యాత్ర సక్సెస్

- ప్రజలకు ధన్యవాదాలు
- మహేష్‌కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర రాష్ట్రంలో విజయవంతమైందని పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అందుకు సహకరించిన ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. యాత్ర జయప్రదం కావడంలో ప్రతి కార్యకర్త, నాయకుడి శ్రమ ఉందని పేర్కొన్నారు. ఈ మేర మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. 15 రోజుల పాటు 19 అసెంబ్లీ, 7 పార్లమెంట్ నియోజకవర్గాల్లో 375 కిలోమీటర్ల మేరకు ఎలాంటి అవాంతరాలు లేకుండా యాత్ర సజావుగా సాగిందని తెలిపారు. ప్రజాస్వామిక, స్వచ్ఛంద సంఘాలు, రైతు, మేధావులు, రైతులు, యువకులు, మహిళలు, విద్యార్థులు, కుల, మత సంఘాలు ఇలా అనేక సంఘాల ప్రతినిధులు రాహుల్‌కు మద్దతు ప్రకటించారని తెలిపారు. పార్టీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి మాట్లాడుతూ బిజెపి, టిఆర్‌ఎస్ విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ మాత్రమే ఎదిరించి పోరాడుతుందని చెప్పారు. రాబోయే రోజుల్లో కేంద్రంలో తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. దేశ ప్రజలు కోల్పోయిన స్వేచ్ఛ, ప్రజాస్వామ్యాన్ని మళ్లీ తిరిగి తెచ్చేందుకే రాహుల్ భారత్ జోడో యాత్ర చేపట్టారని వివరించారు. మునుగోడులో కాంగ్రెస్ మూడో స్థానంలో ఉన్నంత మాత్రాన పార్టీ పనైపోయిందంటూ చెప్పడం సరైందికాదన్నారు. టిఆర్‌ఎస్, బిజెపి కలిసి అండ డబ్బుతో ఓటర్లను మాయ చేశాయని విమర్శించారు.

మోడీకి రాష్ట్రానికి వచ్చే నైతిక హక్కు లేదు

- 12న ప్రధాని పర్యటనను అడ్డుకుంటాం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్రమోడీకి రాష్ట్రానికి వచ్చే నైతిక హక్కు లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ నెల 12న రామగుండంకు ప్రధాని మోడీ వస్తున్నారనీ, ఆ పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానికి ఏమాత్రం ఆత్మాభిమానం ఉన్నా, తెలంగాణ పర్యటనను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని, తెలుగు ప్రజలను అవమానపర్చేలా వ్యాఖ్యలు చేసిన గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ తక్షణమే తెలంగాణను వదిలి వెళ్లిపోవాలని కోరారు. ఈ నెల 12న మోడీ పర్యటనను నిరసిస్తూ సింగరేణి ప్రాంత జిల్లాల్లో గురువారం నుంచి ఆందోళన కార్యక్రమాలను



చేపడుతామని తెలిపారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం ఇలా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని ఏ ఒక్క హామీనైనా కేంద్రం అమలు చేసిందా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఏం చేసిందని నిలదీశారు. త్వరలోనే రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. గవర్నర్ తమిళి సై గవర్నర్‌గా కాకుండా, బిజెపి నేతగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పంపించిన ఎనిమిది బిల్లులు రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. వాటిపై ఏమైనా అభ్యంతరాలు, అనుమానాలుంటే వెనక్కి పంపించాలని సూచించారు. రామగుండంలోని ఎరువుల ఫ్యాక్టరీలో యూరియా ఉత్పత్తి ప్రారంభమైనప్పటికీ పున్నప్రారంభానికి వచ్చి, వరం అందించినట్టుగా మోడీ, బీజేపీ ఫోజు కొట్టేందుకేనని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. సింగరేణి కాలరీస్ సంస్థను, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేసేందుకు కుట్ర పన్నడాన్ని నిరసిస్తున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.సీతారామయ్య చెప్పారు. "ప్రధాని మోడీ గో బ్యాక్ నినాదంతో అన్ని కార్మిక సంఘాలనూ కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్ బోస్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలకు మోడీ ప్రభుత్వం వ్యతిరేకమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, ఈటి నరసింహా, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ బాలరాజ్, ఉపాధ్యక్షుడు బి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


సిపి బ్రౌన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కోలేటి దామోదర్

తెలుగు భాషోద్ధారకుడు బ్రౌన్

ప్రజాశక్తి - కల్చరల్

కడప జిల్లా అధికారిగా బ్రిటన్ దేశీయుడు బ్రౌన్ విశేష పరిశోధనలు చేసి తెలుగు భాషోద్ధారకునిగా గుర్తింపు పొందారని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. శ్రీత్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా మంగళవారం సిపి బ్రౌన్ జయంతి సమావేశం జరిగింది. ముఖ్య అతిధిగా దామోదర్ పాల్గొని మాట్లాడుతూ తెలుగు భాషా పద సంపదను వెలుగులోకి తెచ్చేందుకు నిఘంటువు రూప కల్పనలో విశేష కృషి చేసిన బ్రౌన్ తెలుగు ప్రజలకు ఆత్మీయులుగా ఆరాధన పొందారని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై గాయకుడు త్రినాధ రావు, కవి మిద్దె సురేష్ పాల్గొనగా గానసభ పాలక వర్గ సభ్యురాలు భమిడిపాటి ఉష వందన సమర్పణ చేశారు.

పిల్లలకు నైతిక విలువల విద్య నేర్పాలి

ప్రజాశక్తి - కల్చరల్

నేటి బాలలే రేపటి పౌరులు..వారికి నైతిక పరమైన విద్య నేర్పితే వారి సత్ప్రవర్తనతో సమాజంలో సామరస్యభావన వెల్లివిరియగలదని కేంద్ర పూర్వ మంత్రి డాక్టర్ సముద్రాల వెనుగోపాలా చారి అన్నారు. రవీంద్రభారతి లోని ప్రధాన వేదికపై భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఎ బి సి ఫౌండేషన్ నిర్వహణలో బాలల దినోత్సవ వేడుకలు సంగీత నృత్య భరితంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డాక్టర్ వేణుగోపాలా చారి పాల్గొని మాట్లాడారు. తొలి ప్రధాని నెహ్రుకు బాలలంటే ప్రీతి అని దేశ భవిష్యత్ వారి పైనే ఉందని నమ్మి శాస్త్ర సాంకేతిక రంగాల్లో వారిని ప్రోత్సాహించేలా చర్యలు చేపట్టారని తెలిపారు. భారత్ వరల్డ్ రికార్డ్ అధ్యక్షుడు కెవి రమణరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ, పిల్లలను కళా ప్రక్రియల్లో ప్రోత్సాహించేందుకు పలు కార్యక్రమలు చేపడుతున్నట్లు తెలిపారు. నటుడు జెఎల్ శ్రీనివాస్, నటి రాగిణి సభలో పాల్గొన్నారు.

మునుగోడుకే అభివృద్ధా?

- జి నిరంజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అభివృద్ధి పనులు కేవలం మునుగోడు నియోజక వర్గానికేనా? రాష్ట్రంలోని ఇతర నియోజక వర్గాల అభివృద్ధి పట్టదా? అని పిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ సిఎం కెసిఆర్‌ను ప్రశ్నించారు. మునుగోడులో ఎన్నికల హామీలు వెంటనే ఆచరణలో పెట్టాలనీ, అవి అమలు చేయడానికి పంచాయత్‌రాజ్, రోడ్లు, భవనాలు, నీటిపారుదల, గిరిజన శాఖల మంత్రులు మునుగోడుకు వెళ్లాలని చెప్పడం, జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రణాళికలు సిద్ధం చేయాని చెప్పడం దేనికి సంకేతామని ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన హామీలు మరిచారా? వాటిని అమలు చేసే బాధ్యత లేదా? అని గుర్తు చేశారు.

పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో కొత్త తిరకాసు

- ఒకటో తరగతి నుంచి స్టడీ సర్టిఫికెట్లు కావాలంటూ మెలిక
- ఎంఆర్ఒ కార్యాలయాల చుట్టూ అభ్యర్థులు
- స్టడీ సర్టిఫికెట్ల కోసం పరుగులు
- పార్టు-2 ప్రక్రియ పూర్తయితేనే డిసెంబర్‌లో ఈవెంట్స్?


ట్రైనింగ్‌లో పోలీస్ అభ్యర్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కానిస్టేబుల్, ఎస్ఐ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ గందరగోళంగా మారింది. ఎంపికలో అవకతవకలు జరిగాయని అభ్యర్థులు ఇప్పటికే ఆందోళన చెందుతుంటే.. పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు మరో తిరకాసు పెట్టింది. స్టడీ సర్టిఫికెట్ల సమస్య తెచ్చింది. ఒకటో తరగతి నుంచి మొత్తం స్టడీ సర్టిఫికెట్లు కావాలనడంతో పాటు.. డిగ్రీ సర్టిఫికెట్లు 2022 జూన్ ఒకటో తేదీ లోపు ఉన్న వారికే అవకాశం కల్పిస్తున్నారు. వీటన్నింటితో.. తమ ఆశలపై నీళ్లు చల్లారంటూ నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో పార్టు-2 దరఖాస్తు ప్రక్రియలో గందరగోళం ఏర్పడింది. మరోవైపు సమస్యలు.. సందేహాల నివృత్తి కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్లు కలవడం లేదు. దాంతో పార్టు-2 దరఖాస్తు ప్రక్రియను పొడిగించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టిఎస్ఎల్‌పిఆర్‌బి) రెండు విభాగాల్లో పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఏప్రిల్ 25న నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఎస్ఐ (587), కానిస్టేబుల్స్ (16,929) కలిపి మొత్తం 17,516 పోస్టులకు నోటిఫికేషన్ వచ్చింది. దాంతో ఎస్ఐకి 2,47,217 మంది, కానిస్టేబుల్ పోస్టులకుగాను సుమారు ఏడు లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎస్ఐ పరీక్షను 2,25,759, కానిస్టేబుల్ పరీక్షను 6,03,955 అభ్యర్థులు రాశారు. ఎస్ఐ పరీక్షలో 1,05,603 అభ్యర్థులు పాస్‌కాగా, కానిస్టేబుల్ పరీక్షలో 1,84,861 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. రెండు విభాగాల్లో కలిపి 2.90లక్షల మందికిపైగా ఉత్తీర్ణత సాధించారు. అయితే, పార్టు-2 దరఖాస్తుకు వచ్చేసరికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఈవెంట్స్ కోసం సన్నద్ధం

రెండు విభాగాల్లో పాసైన అభ్యర్థులు ఈవెంట్స్ కోసం ప్రాక్టీస్ చేస్తున్నారు. అయితే, గతంలో పురుషులకు 800 మీటర్లు, లాంగ్ జంప్, షార్ట్‌పుట్ 100 మీటర్లు ఈవెంట్స్ ఉండేవి. మహిళలకు 100 మీటర్లు, లాంగ్ జంప్, షార్ట్‌పుట్ ఉండేది. కానీ, ఇప్పుడు పురుషులకు 1600 మీటర్లు, లాంగ్ జంప్, షార్ట్‌పుట్ ఉంది. మహిళలకు 800 మీటర్లు, లాంగ్ జంప్, షార్ట్‌పుట్ ఈవెంట్స్ పెట్టారు. ఈవెంట్స్‌లో అర్హత సాధించాలని అభ్యర్థులు కసరత్తు చేస్తున్నారు.

జులైలోగా డిగ్రీ సర్టిఫికెట్లు ఎలా సాధ్యం..

పోలీసు శాఖకు చెందిన ఈ రెండు విభాగాల ఉద్యోగాల కోసం 2022 జులై 1వ తేదీ నాటికి సంబంధిత విద్యార్హతలో ఉత్తీర్ణులై ఉండాలి. అయితే, కరోనా ప్రభావంతో మేలో జరగాల్సిన డిగ్రీ పరీక్షలు జూన్-జులై నెలలో జరిగాయి. వాటి ఫలితాలు ఆగస్టు రెండో వారంలో వెలువడ్డాయి. పోలీసు ఉద్యోగ నోటిఫికేషన్‌లో జులై 1లోపే డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలని పేర్కొనడంతో ప్రస్తుతం గందరగోళ పరిస్థితి నెలకొంది. డిగ్రీ చివరి సంవత్సరం రాసిన విద్యార్థులు అధిక సంఖ్యలో ఎస్ఐ పరీక్షల్లో అర్హత సాధించారు. వారంతా ఇప్పుడు పార్టు-2లో ఎస్ఐ, కానిస్టేబుల్‌కు దరఖాస్తు చేసుకోవాలా లేక కానిస్టేబుల్‌కే దరఖాస్తు చేసుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. సర్టిఫికెట్లు జులై తర్వాత అందడంతో ఎస్ఐ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందా లేదో తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నెంబర్లకు అభ్యర్థులు ఫోన్ చేస్తున్నారు. అయితే, అవి కలవకపోవడంతో అభ్యర్థులకు తెలిసిన వారితో వాకబ్ చేస్తున్నారు.

సర్టిఫికెట్ల కోసం నిరీక్షణ

పార్టు-2 దరఖాస్తుల్లో 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లతోపాటు కుల ధృవీకరణ పత్రాలు, బిసి అభ్యర్థులకు నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్లను పొందుపర్చాలని బోర్డు సూచించింది. ఇప్పుడు వాటి కోసం వివిధ మండలాల తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ అభ్యర్థులు తిరుగుతున్నారు. ఎంఆర్ఒ కార్యాలయంలో సర్టిఫికెట్ల జారీకి ఎక్కువ సమయం తీసుకోవడం, మరోపక్క పార్టు-2 అప్లికేషన్‌కు చివరి తేదీ దగ్గర పడుతుండటంతో అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు.

మాయమైన పాఠశాలలు

స్థానికత కోసం పార్టు-2లో 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు బోనఫైడ్స్ జత చేయాల్సి ఉంది. అవి ఉంటేనే కంప్యూటర్ దరఖాస్తులను స్వీకరిస్తుంది. దాంతో సర్టిఫికెట్ల కోసం (20-25 ఏళ్ల కిందట) ఎప్పుడో చదివిన పాఠశాలలకు అభ్యర్థులు పరుగులు తీస్తున్నారు. అయితే, కొన్ని చోట్ల ఆ పాఠశాలలు లేకపోవడం, మరికొన్ని చోట్ల ఆ పాఠశాలలు వేరే పాఠశాలలో విలీనం కావడం, ఇంకొన్ని చోట్ల పాఠశాలలు రద్దు కావడంతో అభ్యర్థులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకవేళ చదువుకున్న పాఠశాలలున్నా యాజమాన్యాలు మారడం, ఇంకొన్ని చోట్ల సర్టిఫికెట్ల కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్న పరిస్థితులున్నాయి. స్టడీ సర్టిఫికెట్లు లేనిచోట్ల ఎంఆర్ఒ కార్యాలయం నుంచి రెసిడెన్సీ సర్టిఫికెట్లు తీసుకోవాలని బోర్డు సూచించింది. అది ఇవ్వడానికి కూడా అధికారులు విచారణ, ఇతర వివరాల కోసం తిప్పలు పెడుతున్నారు. దాంతో అభ్యర్థులు తాసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

మార్చి మొదటి వారంలో మెయిన్స్..?

ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలు ఆగస్టులో పూర్తికాగా, అక్టోబర్‌లో ఫలితాలు విడుదలయ్యాయి. నవంబర్ 25 వరకు అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఈవెంట్స్ కోసం స్టేడియంలు, కంప్యూటర్లు, సిబ్బందిని సిద్ధంగా పెట్టుకోవాలని అన్ని జిల్లా ఎస్‌పి కార్యాలయాలను బోర్డు ఆదేశించింది. డిసెంబర్ రెండో వారం నుంచి జనవరి రెండో వారం వరకు ఈవెంట్స్ నిర్వహించే అవకాశముంది. ఇదే జరిగితే ఫిబ్రవరి చివరి వారంలో లేదా మార్చి మొదటి వారంలో మెయిన్స్ పరీక్షలు జరిగే అవకాశమున్నట్టు విశ్వసనీయ సమాచారం.

బాలికపై సామూహిక లైంగికదాడి

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- నిందితుల కోసం నాలుగు బృందాలు ఏర్పాటు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మీర్‌పేట్‌లో బాలికపై సామూహిక లైంగికదాడి ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లెనిన్ నగర్‌కు చెందిన 13 ఏళ్ల బాలిక ఈ నెల 5న సాయంత్రం ఇంటి నుంచి షాపునకు వెళ్లింది. అదే సమయంలో 21 ఏళ్ల రతన్ అనే యువకుడు బైక్‌పై వచ్చి ఆ బాలికతో మాట్లాడాడు. బాలికను షాపు దగ్గర దించుతానని చెప్పి ఆమెను, మరో బాలుడిని బైక్‌పై ఎక్కించుకుని రాత్రి వరకు చుట్టుపక్కల తిప్పాడు. సుమారు రాత్రి పది గంటల సమయంలో లెనిన్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల దగ్గరకు బాలికను తీసుకెళ్లి ఆమెపై యువకుడు, బాలుడు లైంగికదాడికి పాల్పడ్డారు. విషయం బయటకు చెబితే చంపేస్తామని బాలికను భయపెట్టడంతో ఆమె ఎవరికీ చెప్పలేదు. అయితే 6న బాలికను తల్లిదండ్రులు రాత్రి ఎక్కడి వెళ్లావని మందలించడంతో లెనిన్ నగర్ దగ్గర ఉండే ఇద్దరు వ్యక్తులు తనను కిడ్నాప్ చేశారని చెప్పింది. దాంతో బాలిక తల్లిదండ్రులు లెనిన్ నగర్ లోని డబుల్ బెడ్ రూం దగ్గరకు వెళ్లి అక్కడున్న ఓ యువకుడిని వీడియో కాల్‌లో చూపించి అతడేనా అని బాలికను అడిగారు. అతడే అని బాలిక చెప్పడంతో స్థానికులు ఆ యువకున్ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు పట్టించారు. అయితే పోలీసుల విచారణలో అతను నిందితుడు కాదని తేలింది. బాలిక అబద్ధం చెప్పినట్టు ఒప్పుకుంది. అనంతరం బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మీర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం నాలుగు బృందాలు ఏర్పాటు చేసి గాలిస్తున్నట్టు సిఐ మహేందర్ రెడ్డి తెలిపారు. నిందితుడు రతన్ గతంలో చోరీ కేసులో జైలుకు వెళ్లి వచ్చాడని, అతనిపై నాలుగు దొంగతనం కేసులు ఉన్నాయని సిఐ చెప్పారు.



తమ్మినేనికి వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి

- తమ్మినేని వీరభద్రంను కలిసిన నిమ్స్ సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిమ్స్‌లో కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను నిమ్స్ సిఐటియు నాయకులు కలిసి కోరారు. ఈ మేరకు మంగళవారం తమ్మినేని వీరభద్రంను కలిసి వారు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం సిఐటియు నాయకులు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో లేబర్ కమిషనర్‌తో చర్చలు జరిగిన సమయంలో నిమ్స్ మేనేజ్‌మెంట్ కాంట్రాక్టు ఉద్యోగులతో వేతనాలు పెంచేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. కానీ అది అర్ధాంతరంగా ఆగిపోయిందని ఇప్పుడు యజమాన్యం చెబుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. అయితే కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని సిఎం కెసిఆర్ తమకు హామీ ఇచ్చి అమలుచేయలేదన్నారు. తమ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని తమ్మినేని కోరారు. దీనిపై తమ్మినేని వీరభద్రం స్పందిస్తూ.. త్వరలో సిఎంను కలిసి సమస్యలపైన మాట్లాడుతానని వారికి హామీ ఇచ్చారు. కలిసిన వారిలో నిమ్స్ సిఐటియు అధ్యక్షులు ఈశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి బాలయ్య, శ్రీనివాస్, డేవిడ్, ప్రవీణ్, రాజేష్, డప్పు నరసింహ, రాధిక, లక్ష్మిరాణి ఉన్నారు.





నిజాం కాలేజీ సమస్యను వెంటనే పరిష్కరించండి..

మంత్రి సబితకు కెటిఆర్ సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజాం కాలేజ్ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థినుల హాస్టల్ అలాట్మెంట్ సమస్యపై మంత్రి కెటిఆర్ స్పందించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థినులకు భరోసా ఇచ్చారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని సమస్యను వెంటనే పరిష్కరించేలా చూడాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కోరారు. తాను ఇచ్చిన మాట ప్రకారం హాస్టల్ భవనాన్ని నిర్మించి కాలేజీకి అందించిన తర్వాతైనా ఈ వివాదం అనవసరమని పేర్కొన్నారు. సమస్యకు వెంటనే ముగింపు పలకాలని నిజాం కాలేజ్ ప్రిన్సిపాల్‌కు ఆయన సూచించారు.

మంత్రి కెటిఆర్‌కు కోలేటి అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునుగోడు ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన మున్సిపల్ శాఖ మంత్రి కె తారకరామారావుకు తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్ అభినందనలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మంత్రి కెటిఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సంక్షేమ పథకాలే టిఆర్ఎస్ విజయానికి దోహదం చేశాయని పేర్కొన్నారు. ఆ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటామంటూ కెటిఆర్ చేసిన హామీ ప్రజలను ఎంతగానో ఆకర్షించిందని తెలిపారు.

2027 నాటికి ఎలక్ట్రికల్ కార్లు

- కియా ఇండియా ప్లాంట్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు క్యాబ్‌డాంగ్‌లీ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2025లో ఎలక్ట్రికల్ కార్ల తయారీని ప్రారంభిస్తామని కియా ఇండియా ప్లాంట్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ క్యాబ్‌డాంగ్ లీ తెలిపారు. 2027 నాటికి 14 రకాల మోడల్స్ విడుదల చేస్తామన్నారు. 2045 నాటికి వ్యర్థ ప్లాస్టిక్ రీసైక్లింగ్ ద్వారా కార్లకు అవసరమైన సామగ్రిని తయారు చేయడం ద్వారా ప్రకృతి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలనే లక్ష్యం ఉందని వివరించారు. కియా ప్లాంట్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

సత్యసాయి జిల్లా పెనుకొండ వద్ద యర్రమంచిలో ప్లాంట్ ప్రారంభమై మూడేళ్లు అవుతోందని, 2019లో తొలి కారు తయారీ ప్రారంభమైందని చెప్పారు. ఇప్పుడు మూడు షిఫ్టుల్లో కార్లు తయారీ అవుతున్నాయని తెలిపారు.

దేశీయంగా కియా కార్లకు గిరాకీ పెరుగుతోందన్నారు. కార్ల అమ్మకాల్లో కియా ఐదవ స్థానంలో ఉందని వివరించారు. ప్రస్తుతం నాలుగు రకాల కార్ల తయారీ ఇక్కడే జరుగుతోందని, ఏడాదికి సగటున 3.40లక్షల కార్లు తయారీ అవుతున్నాయని తెలిపారు. ఈ పరిశ్రమ ద్వారా 20 వేల మందికి ఉపాధి కలిగించామన్నారు. ఇందులో 80 శాతం మంది స్థానికులే ఉన్నారని తెలిపారు.

బిజెపికి చెప్పుతో కొట్టినట్టు ప్రజలు బుద్ధి చెప్పారు

- కమ్యూనిస్టుల సహకారంతోనే మునుగోడులో గెలిచాం..
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపికి చెప్పుతో కొట్టినట్టు మునుగోడు ప్రజలు బుద్ధి చెప్పారని పంచాయతీ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ జిల్లా టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెడ్‌పి చైర్మెన్ పాగాల సంపత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ తాటికొండ రాజయ్యతో కలిసి మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. మునుగోడు ఉప ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీల సహకారంతోనే టిఆర్ఎస్ విజయం సాధించిందన్నారు. ఈ నియోజకవర్గంలో కమ్యూనిస్టులకు మంచి పట్టు ఉందన్నారు. మునుగోడు ఎన్నికల్లో బిజెపి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా నియోజకవర్గ ప్రజలు టిఆర్ఎస్ అభ్యర్థిని ఆశీర్వదించి గెలిపించారన్నారు. ఈ గెలుపు బిజెపికి చెంపపెట్టుగా మారుతుందన్నారు. బిజెపి మంత్రులు, నాయకులు వేల కోట్లు ఖర్చుపెట్టి మధ్యంతర ఎన్నికలు తీసుకొచ్చారన్నారు. ఇప్పటివరకు బిజెపి రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. అతి పెద్దదైన కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తే ఇప్పటికీ ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువెళ్లలేదని తెలిపారు. రాష్ట్ర విభజన చట్టాలను అమలు చేయడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందన్నారు. అశాస్త్రీయంగా తెలంగాణకు చెందిన కొన్ని గ్రామాలు ఆంధ్రాలో కలిపారని వాటిని తిరిగి తెలంగాణలో కలపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఊసే లేదన్నారు. రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇవన్నీ కాకుండా రాష్ట్రం నుంచి కేంద్రానికి పంపించిన నిధులను వాడుకోవడం తప్ప తిరిగి అభివృద్ధి నిధులను కేంద్ర ప్రభుత్వం పంపడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడం మానేసి కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి మరింత అభివృద్ధికి రాష్ట్ర బిజెపి నాయకులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో రైతు సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ ఇ రమణారెడ్డి, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బి.విజయ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎడబెల్లి కృష్ణారెడ్డి, టీఆర్ఎస్ నాయకులు పశువుల ఏబిల్, బి. సిద్ధిలింగం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పట్టాలు సాధించే వరకు పోరాటం

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి


పేదలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ రెవెన్యూ సర్వే నెం.283లో పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు సాధించేవరకు పోరాటం కొనసాగుతుందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. వారికి సిపిఎం అండగా ఉంటుందని చెప్పారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో పేదలు వేసుకున్న గుడిసెల ప్రాంతాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. నివాసం లేని పేదలకు నివాస స్థలాలతోపాటు పట్టా సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. అలాగే, ఇంటి నిర్మాణం కోసం మూడు లక్షల రూపాయలు సహాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండ్లు లేని పేదలు 60 గజాల్లో గుడిసెలు వేసుకుంటే జులుం ప్రదర్శించడం ఏమిటని ప్రశ్నించారు. పేదలు వేసుకున్న గుడిసెలు న్యాయ బద్ధమైనవన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఎ.భాస్కర్ రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు జి.శివ కుమార్, కనకయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి భిక్షపతి, నాయకులు సర్వయ్య, ప్రణయ్, కిరణ్, యాదయ్య, మహిళలు అనితా, సౌజన్య, జీవిత, భాగ్యలక్ష్మి, పారిజాత తదితరులు పాల్గొన్నారు.

మోడీ గో బ్యాక్

- 12న ఆర్‌టిసి క్రాస్‌రోడ్డులో కార్మిక సంఘాల నిరసన
- ప్రయివేటీకరణ చర్యలను మోడీ సర్కారు ఉపసంహరించుకోవాలి
- నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : కార్మిక సంఘాల నేతలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి, విద్యుత్, ఎన్‌టిపిసి తదితర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలనీ, నాలుగు లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మోడీ గో బ్యాక్ నినాదంతో ఈ నెల 12న హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్‌రోడ్డులో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు కార్మిక సంఘాల నేతలు ప్రకటించారు. ఈ పిలుపులో కార్మికులు, ఉద్యోగులు భాగస్వామ్యమై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక వాడల్లో ఎక్కడికక్కడ నల్ల జెండాలు ఎగురవేయాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల సంయుక్త సమావేశాన్ని నిర్వహించారు. టిఆర్ఎస్‌కెవి రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శి నారాయణ, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ బాలరాజు, వివిస్ బోస్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు భూపాల్, జె వెంకటేశ్, ఎం వెంకటేశ్, ఐఎన్‌టియుసి ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ యాదవ్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, ఎఐటియుసి నాయకులు సీతారామయ్య, శేషగిరిరావు, సిఐటియు నాయకులు శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ..కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సింగరేణి సంస్థలో నాలుగు బొగ్గు బావులను ప్రయివేటీకరించి ఉద్యోగుల పొట్ట గొడుతోందని విమర్శించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో బొగ్గు వెలికి తీస్తామనీ, 15 బావులకు అనుమతివ్వాలని వినతులు పెట్టుకున్నా కేంద్రం అనుమతులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అదే సమయంలో ప్రయివేటు సంస్థలకు మాత్రం బావుల తవ్వకానికి అనుమతి ఇస్తోందని విమర్శించారు. రూ. మూడు వేల నుంచి నాలుగు వేలకే టన్ను బొగ్గును కోలిండియా ఇస్తానంటున్నా...ఆస్ట్రేలియాలో ఆదానీ సంస్థ నుంచి రూ.పది వేలు వెచ్చించి కొనుగోలు చేయడం దారుణమన్నారు. ఇది దేశ ప్రజల సంపదను అదానీకి దోచిపెట్టడమేనన్నారు. విద్యుత్ సవరణ బిల్లుతో రైతాంగానికి, పారిశ్రామిక వేత్తలకు, ప్రజలకు తీవ్రమైన భారాలను మోపబోతోందని తెలిపారు. ఎన్‌టిపిసిలో ప్రయివేటీకరణ చర్యలకు పాల్పడుతున్నదన్నారు. నేషనల్ మానిటైజేషన్ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నదన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేరచ్చడంలో మోడీ సర్కారు పూర్తిస్థాయిలో విఫలమైందని విమర్శించారు. కార్మిక లోకానికి, రాష్ట్ర ప్రజానీకాని తీరని అన్యాయం చేస్తున్న మోడీకి తెలంగాణలో పర్యటించే హక్కు లేదన్నారు. రామగుండంలోని ఆర్ ఎఫ్‌సిఎల్ ప్రారంభించేందుకు వస్తున్న మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ తక్షణం విడుదల చేయాలి

- మంత్రి సబితకు పిఆర్‌టియుటిఎస్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేయాలని పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, హైదరాబాద్ -రంగారెడ్డి -మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి వినతిపత్రం సమర్పించారు. గత ఐదేళ్లుగా పదోన్నతులు, సాధారణ బదిలీల్లేక ఉపాధ్యాయులు ఎంతో మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే సిఎం కెసిఆర్‌తో మాట్లాడి పదోన్నతులు, బదిలీలకు షెడ్యూల్‌ను విడుదల చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

పేటియంకు రూ.571 కోట్ల నష్టాలు



న్యూఢిల్లీ : డిజిటల్ చెల్లింపుల వేదిక పేటియం మాతృసంస్థ అయినా వన్ 97 కమ్యూనికేషన్స్ మరోసారి భారీ నష్టాలను మూటగట్టుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో రూ.571 కోట్ల నష్టాలు చవి చూసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.473 కోట్ల నష్టాలు నమోదు చేసింది. గడిచిన క్యూ2లో కంపెనీ రెవెన్యూ 76 శాతం పెరిగి రూ.1,914 కోట్లకు చేరింది. గతేడాది ఇదే క్యూ1లో రూ.1,086 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. గడిచిన త్రైమాసికంలో రూ.7,313 కోట్ల రుణాలు జారీ చేసినట్లు ఆ సంస్థ గత నెలలో తెలిపింది.

అన్‌అకాడమీలో 350 మందికి ఎసరు

న్యూఢిల్లీ : ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ అన్‌అకాడెమీ మరో 350 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. గత ఏప్రిల్‌లోనే అన్‌అకాడెమీ 1,000 మంది ఉద్యోగుల్ని తొలగించిన విషయం తెలిసింది. వ్యయ నియంత్రణలో భాగంగా కంపెనీ నుంచి మరో 10 శాతం మంది ఉద్యోగుల్ని తొలగిస్తున్నామని అన్‌అకాడెమీ సిఇఒ గౌరవ్ ముంజల్ మంగళవారం వెల్లడించారు. ఇది కష్టమైన నిర్ణయమే అయినప్పటికీ.. మరో మార్గం లేదని ఉద్యోగులకు ఇచ్చిన సమాచారంలో పేర్కొన్నారు. తొలగించిన ఉద్యోగులకు నోటీసు పీరియడ్‌తో పాటు అదనంగా రెండు నెలలకు సమానమైన వేతనాన్ని ఇస్తామన్నారు. అదనంగా ఒక ఏడాదికి ఆరోగ్య బీమా కవరేజీని కల్పిస్తామన్నారు. మరో ఉద్యోగం పొందడానికి కావాల్సిన మద్దతు కూడా అందిస్తామన్నారు. ఆన్‌లైన్ కార్యకలాపాలు సైతం తగ్గుముఖం పట్టినట్లు తెలిపారు.

జీవితేతర బీమా ప్రీమియంలో 15% వృద్ధి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది సెప్టెంబర్‌లో జీవితేతర బీమా ప్రియం వసూళ్లలో 15.51 శాతం పెరుగుదల చోటు చేసుకుందని జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ (జిఐసి) తెలిపింది. గడిచిన మాసంలో ఇది రూ.20,423.38 కోట్ల ప్రీమియం వసూళ్లయ్యిందని వెల్లడించింది. నాలుగు ప్రభుత్వ రంగ బీమా సంస్థల ప్రీమియంలో ఏకంగా 22.46 శాతం వృద్ధి చోటు చేసుకుందని వెల్లడించింది. ప్రయివేటు రంగ సంస్థల ప్రీమియంలో 14.5 శాతం పెరుగుదల నమోదయ్యింది.